క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

మంథని: రానున్న ఎన్నికలు నియోజకవర్గంలో శాంతియుతంగా నిర్వహించేందుకు రాజకీయ నేతలు సహకరించాలని ఆర్డీవో హనుమా నాయక్ కోరారు. నియోజకవర్గస్థాయి రాజకీయ పార్టీ నేతలతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని 288 పోలింగ్ కేంద్రాలకు బూత్ లెవెల్ ఏజెంట్లను ఒక్కో బూత్‌కు ఒక ఏజెంట్‌ను పార్టీ నుంచి నియమించుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ నెల 19లోగా 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిఎస్పీ, సిపిఎం పార్టీల నాయకులతో పాటు పది మండలాల తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు

మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

పెద్దపల్లిరూరల్: పట్టణ ప్రజలకు కనీస మౌళిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో బుధవారం సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కమిషనర్ వెంకటేశ్, కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి, ఏఈ సతీశ్ ఉన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన దీక్ష



నిరసనలో సమగ్రశిక్ష ఉద్యోగులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలో సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యల సాధనకు చేపట్టిన నిరసన దీక్ష బుధవారం 13వ రోజుకు చేరింది. సీఎం కేసీఆర్ చిత్రాన్ని గీసి చుట్టూ కూర్చొని భజనలు చేశారు. తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కుంబాల సుధాకర్, నాయకులు తిప్పని తిరుపతి, బాలసాని వెంకటేశం, పిల్లి రమేశ్, శ్రీలత, సుప్రజ, శ్రావణ్‌కుమార్, రాజ్‌కుమార్, రహీం పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం చివరి రోజు సందర్భంగా ఆలయంలో పలు రకాల పండ్లతో క్షీరాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లెంకి సత్యనారాయణ భాగ్యలక్ష్మి దంపతులు, కందుకూరి శశికల, శివాలయ భక్త బృందం అల్లంకి ఆనందం, రమేశ్, మాధవి, నగునూరి రామకృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి



నిరసనలో అంగన్‌వాడీలు, నాయకులు

మంథని: అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మె ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు అన్నారు. బుధవారం సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న చట్టబద్ధమైన సమ్మెపై అధికారుల బెదిరింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ ఉన్నారు.

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాం

ధర్మారం: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ చేపట్టే అన్నిరకాల పనులను పకడ్బందీగా అమలుచేస్తూ జిల్లాలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని ప్రగతి మండల సమాఖ్య మండల అధ్యక్షురాలు కాంపెల్లి అపర్ణ అన్నారు. ధర్మారంలోని సెర్ప్ కార్యాలయంలో బుధవారం ప్రగతి మండల సమైక్య మహాసభ ఏపీఎం తులసీమాత అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఈ ఏడాది మార్చి31 నాటికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, వసూళ్లు, చెల్లింపులు, ఆదాయ వ్యయాలపై చర్చించారు. అనంతరం మండల సమైక్య పదాధికారులుగా పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కాంపెల్లి అపర్ణ, ఉపాధ్యక్షురాలిగా పల్లె పద్మ, కార్యదర్శిగా నల్లవెల్లి సుజాత, సహాయ కార్యదర్శిగా కవిత, కోశాధికారిగా మానికను, ఐదుగురు డైరెక్టర్లను ఎన్నుకొన్నారు. ఏపీఎం తులసీమాత, సీసీలు స్వామి, రమేశ్, సత్యనారాయణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పక్కా భవనానికి మోక్షమెన్నడు?

- ఇటీవల వర్షాలకు కూలిన తహశీల్దార్ కార్యాలయం పైకప్పు
- ఇరుకైన గదులు, రిజిస్ట్రేషన్‌లకు ఇబ్బంది



ఓదెల తహశీల్దార్ కార్యాలయం

ఓదెల: ఓదెల తహశీల్ కార్యాలయం కూలడానికి సిద్ధంగా ఉంది. మండలాల వ్యవస్థ ఏర్పడినప్పుడు నిర్మించిన భవనంలో అరకొర సౌకర్యాలతో కొనసాగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పైకప్పు కూలింది. దాదాపు 30ఏళ్లుగా పైబడి శిథిలావస్థ భవనంలోనే తహశీల్ కార్యాలయం కొనసాగుతోంది. పక్కాభవనం కోసం స్థలాన్ని కేటాయించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పంపినప్పటికీ పక్కాభవనానికి నిధులు మంజూరు చేయకపోవడంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇరుకు గదులు..

ప్రస్తుతం ఇరుకు గదుల్లోనే సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇరుకుగా ఉండడంతో మహిళా సిబ్బంది నరకయాతన పడుతున్నారు. ముఖ్యమైన రికార్డులకు ప్రత్యేకగది లేకపోవడంతో భద్రత కరువైంది. వర్షాలు కురిస్తే రికార్డులు తడిసే ప్రమాదం ఉంది. తహశీల్దార్‌కు ప్రత్యేకంగా చాంబర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇటీవల రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్‌కు ప్రత్యేక గది లేకపోవడంతో రైతులు సైతం తిప్పలు పడుతున్నారు. వర్షాలకు కార్యాలయం పూర్తిగా శిథిలావస్థలోకి చేరడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పక్కా భవనానికి నిధులు మంజూరు చేయాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



ఓదెల తహశీల్ కార్యాలయం పక్కా భవనానికి నిధులు మంజూరు చేయాలి. ప్రస్తుతం శిథిలావస్థలోకి చేరిన తహశీల్ కార్యాలయం పైకప్పు కూలడంతో సిబ్బంది, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రికార్డులకు సైతం భద్రత కరువైంది.

– గ్యారవేని నాగరాజు, ఉపసర్పంచ్, హరిపురం

ఇబ్బంది పడుతున్నాం



ఇటీవల కురిసిన వర్షాలకు తహశీల్ కార్యాలయం పైకప్పు కూలడంతో ఇబ్బంది పడుతున్నాం. గదులు ఇరుకుగా ఉండడతో పెరిగిన సిబ్బంది నరకయాతన పడుతున్నారు. పక్కాభవనం నిర్మాణం కోసం మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

– నర్సింగ్, ఆర్ఐ, ఓదెల

'ఎమ్మెల్యేగా పోటీ చేస్తా.. ఆశీర్వదించండి'



మాట్లాడుతున్న కందుల సంధ్యారాణి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. ప్రజల ఓట్లతో గెలిచిన నాయకుడు అనుచరులు, ప్రజల మీద దాడులకు దిగుతున్నారని, ప్రశ్నించిన వారిని గొంతు నొక్కుతున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో భూకబ్జాలు, ఇసుక, బూడిద దందాలను సదరు నాయకుడి అండదండలతో స్వేచ్ఛగా జరుగుతున్నాయని విమర్శించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఎంతోమంది నిరుద్యోగుల నుంచి ఉద్యోగాల పేరుతో స్థానిక నాయకుడి అనుచరులు రూ.లక్షలు దండుకున్నారని ఆరోపించారు. రామగుండం ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని, అన్నివర్గాల ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రామగుండం కార్పొరేషన్ డివిజన్ కార్యకర్తలు, అంతర్గాం, పాలకుర్తి మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణులకు అందుబాటులో వైద్యసేవలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నారాయణ

రామగుండం: గ్రామీణ ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యసేవలు అందించడంలో భాగంగా సీఎం కేసీఆర్ గ్రామాల్లో పల్లె దవాఖానాలు ప్రారంభిస్తున్నారని అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ అన్నారు. ఈ మేరకు బుధవారం అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లిలో పల్లె దవాఖానా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ నిరుపేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతోనే గురుకుల విద్యాలయాలు, పట్టణాల్లో బస్తీ దవాఖానాలు, గ్రామాల్లో పల్లె దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, మండల వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

గోదావరిఖనిటౌన్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించాలని వీఆర్‌పీ(విద్యార్థుల రాజకీయ పార్టీ) నియోజకవర్గ ఇన్‌చార్జి తమ్మెర మన్మోహన్ డిమాండ్ చేశారు. స్థానిక కార్పొరేషన్ ఆవరణలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో బుధవారం ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక 100రోజుల్లో ఎస్సీల ఏబీసీడీల వర్గీకరణ బిల్లు ప్రవేశపెడతామని చెప్పి, ఇంతవరకు ఇచ్చిన మాట నిలుపుకోలేదన్నారు. బిల్లు వెంటనే ప్రవేశపెట్టి ఇచ్చిన మాట నిలుపుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవికుమార్, నాయకులు కాసిపేట రాజయ్య, కాంపెల్లి శ్రీనివాస్, కల్వల ప్రదీప్‌కుమార్, శనిగరపు పాల్, పుల్లూరు కొమురయ్య, ఈర్ల రవి, మురళి, సాతూరి కృష్ణ, మారుమూల కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ బీజేపీ చీఫ్‌ను కలిసిన కౌన్సిలర్

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ కౌన్సిల్‌లో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. పెద్దపల్లి నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. ఇటీవల హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కూడా ముదిరాజ్ కులస్తులతో భారీ ప్రదర్శనగా వెళ్లి కలిశారు. బీఆర్ఎస్ పార్టీలో ఉంటూనే బీజేపీ తరఫున పోటీ చేసేందుకు యత్నిస్తుండడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

✦ గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో బుధవారం గ్రామ దేవతలు పోచమ్మ, భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మల్లేశ్, జనరల్ సెక్రటరీ సతీశ్‌కుమార్, సమ్మయ్య, రాజు, కుమార్, సదానందం, స్వామి పాల్గొన్నారు.

✦ ఎల్‌వోసీ అందజేత

ఓదెల: మండలంలోని మడకకు చెందిన దుర్గం రమ్యకు డయాలసిస్ కోసం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి రూ2.50లక్షల విలువైన చెక్కును ఎల్‌వోసీ కింద బుధవారం అందజేశారు.

✦ ఉచిత మెడికల్ క్యాంప్

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో సర్పంచ్ లావణ్య ఆధ్వర్యంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ బృందంతో బుధవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యులు గ్రామంలోని 150 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులు అందజేశారు. సీఎస్‌సీ హెల్త్ కేర్ మెడికల్ క్యాంపు టీం సుందర్, తిరుమలేశ్వరి, వినోద్, మహేందర్, శివ, గ్రామ కార్యదర్శి పర్శరాం పాల్గొన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ లత, హెచ్ఈవో సీతారం, ఏఎన్ఎం స్వరూప పాల్గొన్నారు.

✦ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఈ ఆఫీసు ఎదుట బుధవారం చేపట్టిన దీక్షలో ఆయన పాల్గొన్నారు.

✦ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న తమ్మిశెట్టి రాంబాబు (46) అనే తాపీ మేస్త్రీ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడని ఎస్సై మహేందర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన రాంబాబు వలస వచ్చి పెద్దపల్లిలో భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. మంగళవారం బైక్‌పై ఇంటి నుంచి వస్తుండగా అదుపు తప్పి పడిపోవడంతో గాయాలపాలయ్యాడు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడని ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు పిల్లలున్నారు.

✦ ఫుడ్ స్టోరేజీపై అవగాహన

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రం పెద్దపల్లిలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)లో బుధవారం ట్రినిటి కాలేజీ విద్యార్థులకు ఫుడ్ స్టోరేజీపై అవగాహన కల్పించారు. పెద్దపల్లి ఎఫ్‌సీఐ డిపో మేనేజర్ చంద్రమోహన్, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ మురారి, సీనియర్ అధికారి అనిల్, ఫుడ్ స్టోరేజీ డిపార్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

✦ సెల్‌ఫోన్ అప్పగింత

ఓదెల: కేశవపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన కనకం కుమార్ కుమార్ ఇటీవల ఓదెల మల్లికార్జునస్వామి దర్శనం కోసం వచ్చి సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పద్ధతి ద్వారా ఎస్సై నూతి శ్రీధర్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్ దొరకబట్టి కుమార్‌కు అందజేశారు.

✦ సాహిత్యరత్న అవార్డు గ్రహీతకు సన్మానం

ధర్మారం: సాహితరత్న జాతీయ అవార్డుకు ఎంపికైన మండలంలోని గోపాల్‌రావుపేట పాఠశాల ఉపాధ్యాయుడు జాడి శ్రీనివాస్‌ను బుధవారం ధర్మారం మండలం సాయంపేట సర్పంచ్ చెన్నెల్లి సాయి సన్మానించారు.

✦ ఉత్తమ ఉపాధ్యాయుడికి..

రామగుండం: అబాది రామగుండంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దాసరి రఘుగౌడ్ ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించారు. కాగా బుధవారం పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు సన్మానించారు.

బీఆర్ఎస్ పాలనతోనే సంక్షేమం



ప్రచారంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: బీఆర్ఎస్ పాలనతోనే ప్రజలకు మేలు కలుగుతుందని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో బుధవారం ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కే అధికారం అప్పగించాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, నాయకులు గీతాంజలి, వెంకటేశ్, రమాదేవి, శ్రీధర్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

సుల్తానాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని నర్సయ్యపల్లిలో బుధవారం రూ.20లక్షలతో గ్రామపంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. సర్పంచ్ లావణ్య, ఎంపీపీ బాలాజీరావు, సింగిల్ విండో చైర్మన్ జుపల్లి సందీప్‌రావు తదితరులున్నారు.

అవయవదానంపై యూపీహెచ్‌సీలో ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కోల్‌సిటీ: గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని యూపీహెచ్‌సీ ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవయవదానంపై 42వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కృపాభాయి, మెడికల్ ఆఫీసర్ మణికేశ్వర్‌రెడ్డి అవగాహన కల్పించారు. అనంతరం అందరితో అవయవదానంపై ప్రతిజ్ఞ చేయించారు. కేంద్ర రాష్ట్ర ఆరోగ్యశాఖ పిలుపు మేరకు ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ఆస్పత్రిలో ప్రారంభించినట్లు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేయడంతోపాటు 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. ఏఎన్ఎంలు స్వప్న, శారద, పద్మ, మల్లమ్మ, విజయ, పద్మ పాల్గొన్నారు.

వాకింగ్‌కు ఇబ్బందులు కలగకుండా చూడండి

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకింగ్ చేసే వారు నీటితో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తొలగించాలని మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. వాకింగ్ చేసేందుకు మున్సిపల్ కమిషనర్ బుధవారం రావడంతో నీరు నిలిచే ప్రాంతాన్ని ఆయనకు చూపించారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ కార్మికులకు చెప్పి నీటిని తొలగించి, కాలువలు ఏర్పాటు చేసి నీటి నిల్వ లేకుండా చేశారు.

రచ్చపల్లిలో నిర్బంధ తనిఖీలు



మాట్లాడుతున్న సీఐ అఫలుద్దీన్

మంథని: మంథని మండలం రచ్చపల్లిలో గోదావరిఖని టూటౌన్ సీఐ అఫలుద్దీన్ బుధవారం నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యత అని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులు షెల్టర్ తీసుకొని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా కొత్త వారు అద్దెకు వస్తే వారికి సంబంధించిన పూర్తి సమాచారం తీసుకోవాలన్నారు. మంథని, రామగిరి ఎస్సైలు కిరణ్, రాణి ఉన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఆయుధమని, ఓటుహక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో జిల్లాలోని డిగ్రీ, పీజీ, మెడికల్, క్యాంపస్ అంబాసిడర్లతో జిల్లా పాల్గొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అక్టోబర్ 1, 2023 నాటికి 18ఏళ్లు నిండిన వారు తమ పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని అన్ని కాలేజీల్లో ఓటు నమోదుపై గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, ఆర్డీవో మధుమోహన్, స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రవూఫ్‌ఖాన్, డాక్టర్ కె.లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

'మా భూములను ధరణిలో నమోదు చేయండి'



కలెక్టర్‌కు విన్నవిస్తున్న ఎంపీపీ దేవక్క

రామగిరి: మండలంలోని బుధవారంపేట గ్రామంలో గల వ్యవసాయ భూములను ధరణిలో నమోదు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు ఎంపీపీ ఆరెల్లి దేవక్క బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2 విస్తరణలో భాగంగా గ్రామంలోని వ్యవసాయ భూములు కోల్పోతున్నట్లు గ్రామ ప్రజలకు తప్పుడు నోటిఫికేషన్లు జారీ చేసి గ్రామ వ్యవసాయ రైతుల పేర్లను ధరణి నుంచి తొలిగించి అన్యాయం చేశారని ఆరోపించారు. 8ఏళ్లుగా ప్రభుత్వం కల్పిస్తున్న రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయ రుణ సదుపాయం, బ్యాంక్ లోన్లు నష్టపోయామని, వెంటనే రైతులకు పరిహారం అందించాలని కోరారు. హైకోర్టు తీర్పు ప్రకటించి అవార్డు క్యాన్సిల్ చేసిందని రైతుల పేర్లు నమోదు చేయాలని, వెంటనే ధరణిలో నమోదు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. గ్రామంలో 708 ఎకరాల వ్యవసాయభూమిలో మళ్లీ 88 ఎకరాలను సింగరేణి సంస్థ భూసేకరణ చేపట్టనున్నందున మిగతా రైతులకు ఇబ్బందులు కలగకుండా మిగిలిన 625 ఎకరాల భూమిని ధరణిలో నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చందర్

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో బుధవారం బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆవిష్కరించి నివాళి అర్పించారు. కార్యక్రమానికి అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధి ఇండిబిల్లి రవీందర్ అధ్యక్షత వహించారు. టీటీఎస్ అంతర్గాం సర్పంచ్ కుర్ర వెంకటమ్మ, జెడ్పీటీసీ ఆముల నారాయణ, ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, బీఆర్ఎస్ ప్రతినిధులు తిరుపతినాయక్, గీట్ల శంకర్‌రెడ్డి, కౌశిక హరి, ఎలుక కొమురయ్య, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల ప్రతినిధులు మైస రాజేశ్, బొంకూరి మధు, కాంపెల్లి సతీశ్, మామిడిపెల్లి బాపయ్య, కోఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా పాల్గొన్నారు.

అభివృద్ధిపై బీఆర్ఎస్ నాయకులను నిలదీయాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న దాసరి ఉష

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి చేయకపోగా ఓట్లు అడిగేందుకు వచ్చే బీఆర్ఎస్ నాయకులను నిలదీయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. మండలంలోని నారాయణపూర్ గ్రామంలో బుధవారం మన ఊరు–మన ఉష కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు గోపాల్‌యాదవ్, కోశాధికారి ఎండీ రియాజ్, కన్వీనర్ అరుణ, చంద్రశేఖర్, అనిల్ పాల్గొన్నారు.

రానున్నది బహుజన రాజ్యమే

జూలపల్లి: రాష్ట్రంలో రానున్నది బహుజన రాజ్యమేనని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పార్టీ నియోజకవర్గ కోకన్వీనర్ దేశబోయిన అఖిల, మండల అధ్యక్షుడు సీపెల్లి కొమురయ్య ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని చీమలపేటకు చెందిన కాంగ్రెస్ నుంచి 11 మంది, బీఆర్ఎస్ నుంచి 9 మంది, బీజేపీ నుంచి ఒకరు బీఎస్పీలో చేరేందుకు వచ్చిన నాయకులకు నియోజకవర్గ ఇన్‌చార్జి ఉష పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కత్తెర్ల లక్ష్మన్, నాయకులు మల్లేశం, నిఖిల్‌కుమార్, శివ, దొడ్డి అశోక్, శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

పార్టీలో చేరిక

పెద్దపల్లిరూరల్: వచ్చే ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాల వారంతా ఏకమై బహుజనరాజ్యం స్థాపిద్దామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పెద్దపల్లిలోని తన కార్యాలయంలో బుధవారం వివిధ పార్టీల నుంచి వచ్చిన పలువురికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు కొమురయ్య, రాజేశం, సంపత్, మల్లేశం, వెంకటేశం, రామచంద్రం, పోచాలు, రవీందర్ ఉన్నారు.

భూసేకరణపై అభ్యంతరాలు

మంథని: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్నారం బ్యాక్ వాటర్‌లో కోల్పోతున్న భూమి సేకరణలో అభ్యంతరాలు ఉన్నాయని మంథని మండలం ఖానాపూర్ రైతులు అధికారులకు వినతిపత్రం అందించారు. బుధవారం గ్రామంలో 36ఎకరాల భూసేకరణ జరుగుతుందని అధికారులు వివరించగా పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రీ సర్వే చేయాలని కోరారు.

ఆయుష్మాన్‌భవతో వేగంగా వైద్యసేవలు

సుల్తానాబాద్: రోగులకు ఆయుష్మాన్‌భవతో వైద్యసేవలు వేగంగా అందుతాయని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయుష్మాన్‌భవ ప్రారంభించిన అనంతరం టీవీ ప్రసారాలను తిలకించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, కమిషనర్ మల్లికార్జున్, డాక్టర్ రమాదేవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్ రావు ఉన్నారు.

ధర్మారం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశవ్యాప్తంగా ప్రారంభిస్తున్న ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని మండలంలోని మేడారం పీహెచ్‌సీలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, వైద్యాధికారులు సిబ్బంది వీక్షించారు.

ఆర్టీసీ బస్‌స్టాండ్‌కు రెండు టీవీలు బహూకరణ

ధర్మారం: ధర్మారం అలయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కొత్త మోహన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యం కోసం రెండు టీవీలను బహూకరించారు. ఆర్టీసీ కంట్రోలర్ రాజునాయక్, క్లబ్ జోనల్ చైర్మన్ తాళ్లపెల్లి సురేందర్, పీఆర్‌వో బైరి చంద్రమౌళి, సభ్యులు సుభాష్, శ్రీనివాస్, తిరుపతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆది మల్లన్న పట్నాలు



ముత్తారం: మండలంలోని పారుపల్లి ఆది మల్లికార్జునస్వామి ఆలయంలో ఆది మల్లన్న బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగవైభవంగా జరిగాయి. ఒగ్గు పూజారులు పట్నాలు వేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు చల్ల నారాయణరెడ్డి, ముత్తారం మాజీ జెడ్పీటీసీ నాగినేని జగన్‌మోహన్‌రావు ఆలయంలో మొక్కులు చెల్లించారు. ఆలయ అభివృద్ధికి కమిటీ నిర్వాహకులకు రూ.15వేలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అమ్ము వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.